ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
సోమవారం 14 అక్టోబరు 2024


దహనమవుతున్న రావణ ప్రతిమ


వరంగల్ రంగలీల మైదానం వద్ద రావణ వధ కార్యక్రమానికి హాజరైన ప్రజలు

రావణ వధ.. ఓరుగల్లు ఫిదా..


మాట్లాడుతున్న మంత్రి సురేఖ

ధూంధాంగా దసరా వేడుకలు

- ఆకట్టుకున్న బాణసంచా..
- వినీలాకాశంలో తారాజువ్వల సందడి..
- మిరుమిట్లు గొలిపిన విద్యుత్ వెలుగులు
- 70 అడుగుల దశకంఠుడి ప్రతిమ దహనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- జనసంద్రమైన ఉర్సుగుట్ట రంగలీలా మైదానం
- చెడుపై మంచి సాధించిన విజయం : మంత్రి సురేఖ

కరీమాబాద్, అక్టోబరు 13: దసరా వేడుకలు వరంగల్‌లోని రంగలీలా మైదానంలో అంగరంగవైభవంగా శనివారం జరిగాయి. విద్యుత్ దీపాల వెలుగుల మధ్య ఉర్సు గుట్ట రంగలీలా మైదానం మెరిసిపోయింది. సుమారు 70అడుగుల భారీ రావణ వధను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అంతకుముందు బాణాసంచా వీనుల విందు చేసింది. వినూత్న తారాజువ్వలు ఆహుతులను మైమరపింపజేశాయి. నాగుపాము, మల్లెచెట్టు, తారాజువ్వలు పలు రకాల వెరైటీల బాణాసంచాకు ఓరుగల్లువాసులు ఫిదా అయ్యారు. అంతేకాకుండా రావణ వధ కార్యక్రమం జరుగుతున్న సందర్భం నుంచి సుమారు గంటపాటు ఉర్సు గుట్టపై కాల్చిన తారాజువ్వలతో ఆకాశం మెరుపులు అద్దుకున్నదా అన్నట్టుగా సాగింది. రావణ వధ, బాణాసంచా ఘట్టాల వేడుకల్ని తిలకించేందుకు వచ్చిన వారు తమ సెల్‌ఫోన్‌లలో బంధించారు. వేదికపై నుంచి మంత్రి, మేయర్ సుధారాణి చేతుల మీదుగా రిమోట్‌తో రావణ దహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కొండా సురేఖ, ప్రత్యేక అతిథిగా శాసన మండలి ఉప సభాపతి బండా ప్రకాష్, విశిష్ఠ అతిథిగా మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, గౌరవ అతిథులుగా కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిషోర్ ఝూ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. కరీమాబాద్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు అధ్యక్షత వహించారు.

చెడుపై మంచి విజయం : మంత్రి

మంత్రి సురేఖ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి నిదర్శనమే ఈ దసరా వేడుకలని, చరిత్ర ప్రకారం శ్రీరాముడు రావణ సంహారంతో విజయం సాధించడమే కాక, పాండవులు వనవాసం వెలుతూ జమ్మి చెట్టుపై ఉన్న తమ ఆయుధాలను తిరిగి తీసుకున్న రోజని గుర్తుచేశారు. జగన్మాత దుర్గాదేవి మహిషాసురుడనే రాక్షసుడితో తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసి అతడిని వధించి జయాన్ని పొందిన సందర్భంగా విజయదశమి వేడుకలను జరుపుకుంటామని అన్నారు. ఈశాన్య భారతదేశంలో దేవీ పూజా ప్రాధాన్యత అధికంగా ఉంటుందని, అలాగే మన దగ్గర కూడా దేశంలో రెండో ప్రాంతంగా మన వరంగల్ నగరంలో ఈ ఉత్సవాలను నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దసరా ఉత్సవాలకు మరింత స్థలం సేకరించే ప్రక్రియను కొనసాగిస్తానని, రంగలీలా మైదానం ఎదురుగా ఉన్నటువంటి స్థలాన్ని రంగలీలా మైదానానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు.

కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ తొలిసారిగా ఈ వేడుకలకు హాజరైనట్లు తెలిపారు. ఉత్సవాలు చాలా వైభవంగా నిర్వహించారని, ప్రజల జీవితాల్లో విజయం నిండాలని కోరుతూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ గుండు సుధారాణి మా ట్లాడుతూ ఉర్సు గుట్ట, బండ్ ప్రాం తాన్ని మరింత అభివృద్ధి చేసేలా మంత్రి చర్యలు తీసుకోవాలని

మిగతా 8వ పేజీలో...


కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన


బాణసంచా వెలుగులు


మాట్లాడుతున్న మంత్రి సురేఖ


భద్రకాళి తటాకంలో తెప్పోత్సవం

అలరించిన తెప్పోత్సవం

- జలవిహారంలో హంస వాహనంపై అమ్మవారు
- నిజరూప దర్శనంలో భద్రకాళి
- దసరా వేళ పోటెత్తిన భక్తులు
- హాజరైన మంత్రి సురేఖ, కలెక్టర్



వరంగల్ కల్చరల్, అక్టోబరు 13: భద్రకాళి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అంగరంగ వైభవంగా తెప్పోత్సవం జరిగింది. భద్రకాళి చెరువులో ప్రత్యేకంగా అందంగా ముస్తాబు చేసిన తెప్పపైకి వెళ్లి అక్కడ ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత తెప్ప చెరువులో సుమారు అరగంట పాటు తిప్పిన తర్వాత ఒడ్డుకు తీసుకువచ్చారు. హంస వాహనంలో అమ్మవారు కొలువు తీరి ఉండగా జరిగిన తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వేలాది మంది హాజరయ్యారు. అంతకు ముందు చెరువు ఒడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు భద్రకాళి శేషు పూజలు నిర్వహించారు. తెప్పోత్సవంలో పాల్గొన్న అతిథులను సత్కరించారు. విజయ దశమిని పురస్కరించుకొని ఉదయం అమ్మవారికి ఉదయం సామ్రాజ్య పట్టాభిషేకం, చక్రస్నానం అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. ఆదివారం రాత్రి భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, వ్యాపారవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్ రావు, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునీత, ఏసీపీ నందిరామ్ నాయక్ హాజరయ్యారు.

పోటెత్తిన భక్తులు

దసరా సందర్భంగా ఉదయం 4 నుంచి రాత్రి వరకు ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. సర్వదర్శనానికి రెండు నుంచి మూడు గంటల సమయం పట్టింది. వీఐపీల తాకిడి పెరగడంతో భక్తులు ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. కాగా, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు తరలి వచ్చిన భక్త జనులకు సౌకర్యాలు కల్పించి ఉత్సవ నిర్వహకులు, వివిధ శాఖల అధికారులకు ఆలయ ఈవో శేషు భారతి కృతజ్ఞతలు తెలిపారు.



కుటుంబ కలహాలతో గన్‌తో కాల్చుకుని..

- ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ ఆత్మహత్య
- మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


శ్రీనివాస్ (ఫైల్)


ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 13 : కుటుంబ కలహాలతో ఏఆర్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్ (59) ఆదివారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో స్ట్రాంగ్‌రూం వద్ద తన గన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గోపాల్‌రావునగర్ కాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ గుడిబోయిన శ్రీనివాస్‌కు అతని భార్య విజయలక్ష్మి మధ్య జరిగిన గొడవలతో పదేళ్ల క్రితం కుమారుడు సుశాంత్‌ను తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే ఉంటోంది. శ్రీనివాస్ మహబూబాబాద్‌లో తల్లిదండ్రుల వద్ద ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన శ్రీనివాస్ తనగన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. శ్రీనివాస్ 1990 సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి జిల్లా ఏర్పడిన తర్వాత హనుమకొండ నుంచి మహబూబాబాద్ పోలీస్ కార్యాలయానికి 2016లో బదిలీపై వచ్చాడు. 2018లో హెడ్ కానిసేబుల్‌గా పదోన్నతి పొంది, గతనెల నుంచి కలెక్టరేట్ కార్యాలయంలోని స్ట్రాంగ్‌రూం వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ సహ ఉద్యోగి దాము భోజనం విరామ సమయంలో ఇంటికి వెళ్లాడు. ఎవరూ లేని సమయంలో ఆదివారం సాయంత్రం 4.40 గంటల ప్రాంతంలో శ్రీనివాస్ తన గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దాము మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి వచ్చే సరికి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని విగత జీవిగా పడి ఉండడంతో వెంటనే ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌తో పాటు డీఎస్పీ తిరుపతిరావుకు సమాచారం అందించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, డీఎస్పీ తిరుపతిరావు ఘటనా స్థలానికి వెళ్లి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్న తీరును పరిశీలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య విజయలక్ష్మి, కుమారుడు సుశాంత్ ఉన్నారు. శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కొండా వర్సెస్ రేవూరి

- ఫ్లెక్సీ ఏర్పాటులో తలెత్తిన వివాదం
- ఆటోలో పోలీసు స్టేషన్‌కు చేరుకున్న మంత్రి సురేఖ
- తన అనుచరులను కొట్టారని పోలీసులపై మంత్రి ఫైర్
- సీఐ, ఏసీపీ, డీసీపీలను రిలీవ్ చేయాలని సీపీకి ఫోన్
- గీసుగొండ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు
- కొనసాగిన ఉద్రిక్తత



గీసుగొండ పోలీస్‌స్టేషన్ వద్ద గుమిగూడిన కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న మంత్రి

గీసుగొండ, అక్టోబరు 13: వరంగల్ జిల్లా గీసుగొండలో కాంగ్రెస్ వర్గవిబేధాలు భగ్గుమన్నాయి. కొండా, రేవూరి వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు రచ్చకెక్కింది. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ధర్మారంలో ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ వివాదం ముదరడంతో ఆదివారం ఉద్రిక్త పరిస్థితికి తలెత్తాయి. తమ అనుచరులను పోలీసులు అకారణంగా పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి, కొట్టడంతో పోలీసు స్టేషన్‌కు అటవీ, దేవాదాయ, ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖ రావడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మంత్రి ఆటోలో గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఆమె వర్గీయులు, అభిమానులు పెద్దసంఖ్యతో తరలివచ్చారు. దీంతో స్టేషన్ వద్ద తీవ్ర గందరగోళం ఏర్పడింది. కొండా వర్గీయులు స్టేషన్ వద్ద ఎమ్మెల్యే రేవూరి డౌన్.. డౌన్ అంటూ నినాదాలు చేశారు. మంత్రి నేరుగా స్టేషన్‌పై గదిలో పోలీసుల అదుపులో ఉన్న తమ వర్గీయుల వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని ఆరా తీశారు. పోలీసులు తమను కొట్టారని మంత్రికి వారు చెప్పటంతో ఆమె మరింత ఆగ్రహించారు. తమ వర్గీయులను ఎందుకు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కొట్టారు అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఫిర్యాదు ఎవరు చేశారు, ఏమని చేశారు, బీర్ సీసాలతో ఎవరు కొట్టారు అని అక్కడ ఉన్న డీసీపీని మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు. కొట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారు అంటూ మండిపడ్డారు. ఫిర్యాదు చేసిన వారిని కూడా స్టేషన్‌కు తీసుకువచ్చి మీరు కొట్టారంటూ డీసీపీపై ఆగ్రహించారు.

స్టేషన్ నుంచే వరంగల్ నగర పోలీసు కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాకు ఫోన్ చేసి ఎస్ఐ, సీఐ, డీసీపీలను రిలీవ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. గవర్నమెంట్‌లో ఉన్నాను, నేను మినిస్టర్‌ను నా ఫాలోవర్‌లను, ఎలక్షన్‌లో పనిచేసి ఓట్లేసి గెలిపించిన వారిని ఎలా కొడతారు అంటూ సీపీతో వాదించారు. తాన వరకు ఇలాంటివి రానివ్వ వద్దని పలుమార్లు చెప్పినా, మీరు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అందుకే పోలీస్‌స్టేషన్‌కు రావాల్సి వచ్చిందని సీపీకి ఆమె స్పష్టం చేశారు. కొట్టిన పోలీస్‌లను రిలీవ్ చేసే వరకు పోలీస్‌స్టేషన్ నుంచి కదిలేది లేదని సీఐ కుర్చీలో భీష్మించుకొని కూర్చున్నారు. కొద్ది సేపటికి సీపీ స్టేషన్‌కు చేరుకున్నారు. సీపీ రాకతో అక్కడ ఉన్న కొండా వర్గీయులను అక్కడ నుంచి బయటికి పంపించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారితో సీపీ, మంత్రి ముందు మాట్లాడారు. శాంతించిన మంత్రి స్టేషన్ నుంచి బయటికి వెళ్లిపోయారు.

ఫ్లెక్సీ విషయంలో తలెత్తిన వివాదం..

దసరా వేడుకల సందర్భంగా గీసుగొండ ధర్మారంలో ఫ్లెక్సీలో కట్టే విషయంలో కొండా, పరకాల కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణకు దారితీసింది. దసరా శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ఫొటో ఎందుకు పెట్టలేదని కొండా వర్గీయులతో రేవూరి వర్గీయులు వాగ్వాదానికి దిగారు. మరుసటి రోజు ఆ ఫ్లెక్సీ చినిగి ఉండటంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రేవూరి వర్గానికి చెందిన పిట్టల అనిల్ తనపై బీరు సీసాలతో దాడి చేశారంటూ కొండా వర్గీయులైన బండి రాజ్‌కుమార్, ముసుకు సురేష్, కూస రాజ్‌కుమార్, చుంచు రాజు, చౌడ శివప్రసాద్, ముసుకు రంజిత్‌కుమార్, మహేశ్వర్, వంశీలపై ఫిర్యాదుచేశాడు. దీంతో కొండా వర్గీయులను స్టేషన్‌కు తీసుకువచ్చి పోలీసులు కొట్టారని ఆరోపిస్తూ ధర్మారం వద్ద ఆదివారం గంట పాటు రాస్తారోకో చేశారు. ఈ విషయాన్ని మంత్రి కొండా సురేఖకు స్థానిక నాయకులు సమాచారం అందించడంతో మంత్రికి ఆగ్రహం తెప్పించింది. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌కు రావటంతో కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య పెద్ద దుమారం చెలరేగింది.


సీపీ సమక్షంలో సీఐ సీటులో కూర్చున్న మంత్రి సురేఖ



సీఐ సీట్లో కూర్చున్న మంత్రి..

ప్రొటోకాల్ వివాదం..

పోలీసులు అదుపులోకి తీసుకున్న తన అనుచరుల కోసం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సీఐ సీట్లో కూర్చోవటం చర్చనీయాంశంగా మారింది. ఫైర్‌బ్రాండ్ అయిన మంత్రి సురేఖ మరో కొత్త సమస్యను కొని తెచ్చుకుంటుందనే చర్చ సాగుతోంది. ప్రోటోకాల్ నిబంధనల ప్రకారం సీఐ సీట్లో కూర్చోవచ్చా లేదా అనే అంశం వివాదాస్పదంగా మారింది. మంత్రి సీఐ సీట్లో కూర్చొని తన అనుచరుల ముందే పోలీసు అధికారులతో వాదించటం దుమారంగా మారింది. మంత్రిని కలిసేందుకు స్టేషన్‌కు వచ్చిన సీపీ ముందుగా అక్కడ ఉన్నవారిని బయటికి పంపించి కూర్చున్నారు.

వాగు వద్దకు సరదాగా వెళ్లి..

- గల్లంతై ఇద్దరి మృతి


రాములు (ఫైల్)


హరీశ్ (ఫైల్)

టేకుమట్ల, అక్టోబరు 13: దసరా సంబరాలు ముగియకముందే ఆ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వాగులో నీట మునిగి ఇద్దరు మృతి చెందారు. మండలంలోని వెల్లంపల్లిలో ఆదివారం ఈ దుర్ఘటన జరిగింది. కుటుంబ సభ్యులు కథనం ప్రకారం... వెల్లంపల్లికి చెందిన సొల్లేటి రాములు (45), గీత హరీశ్ (38), గంపల సుధాకర్, గంపల కార్తీక్, దార శేషు, జాంటు హరీశ్ కుటుంబాలు దసరా సందర్భంగా సరదా కోసం రాఘవరెడ్డిపేట-టేకుమట్ల గ్రామాల మధ్య ఉన్న చలివాగు వద్దకు వెళ్లాయి. హరీశ్, రాములు, శేషు, హరీశ్ సుధాకర్ వాగులో ఈత కోసం దిగారు. ముందుకు వెళ్తున్న క్రమంలో లోతైన ప్రదేశంలో వీరందరూ నీటమునిగారు. శేషు, హరీశ్, సుధాకర్ బయట పడగా, హరీశ్, రాములు బయటకు వచ్చే ప్రయత్నంలో మునిగిపోయారు. కొద్దిసేపటి తర్వాత మృతదేహాలు లభ్యమయ్యాయి.

పోలీస్ కమిషనరేట్‌లో ఆయుధ పూజ

వరంగల్ క్రైం, అక్టోబరు 13: విజయదశమి పండుగను పురస్కరించుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. శమీ వృక్షానికి పూజలు చేసి కమిషనర్ అధికారులు, సిబ్బందికి శమీ ఆకులను అందచేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, మధుసూదన్, అనంతయ్య, సురేంద్ర, ఆర్‌ఐలు శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా

యువతిని వేధించిన వ్యక్తికి దేహశుద్ధి

హనుమకొండ బస్టాండ్‌లో ఘటన

బాలసముద్రం, అక్టోబరు 13: మద్యం మత్తులో యువతిని వేధించిన ఓ వ్యక్తికి దేహశుద్ధి చేసిన ఘటన హనుమకొండ బస్టాండ్‌లో శనివారం రాత్రి జరిగింది. ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తున్నది. దసరా పండుగ కోసం సొంత ఊరు ములుగుకు వెళ్లేందుకు బస్సులో హనుమకొండకు చేరుకుంది.

ములుగుకు వెళ్లే బస్సు కోసం వేచి ఉండగా తనతో రావాలంటూ ఆ వ్యక్తి వేధించాడు. విషయాన్ని అక్కడి సెక్యూరిటీ సిబ్బంది, ప్రయాణికుల వద్ద యువతి గోడు వెల్లబోసుకుంది. దీంతో అక్కడి వారు ఆ వ్యక్తిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ వ్యక్తి వివరాలను సెక్యూరిటీ సిబ్బంది ఆరా తీశారు. అతడు హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడంతో పూర్తి వివరాలు సేకరించలేకపోయారు. అతడిపై చర్యలు తీసుకోవాలని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అంబరాన్నంటిన దసరా వేడుకలు



వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకలను తిలకిస్తున్న ప్రజలు



వరంగల్ ఉర్సు రంగలీలా మైదానంలో రావణ వధ వేడుకల్లో మాట్లాడుతున్న నగర మేయర్ గుండు సుధారాణి





రంగలీలా మైదానంలో నృత్యం చేస్తున్న దృశ్యం



మహబూబాబాద్ జిల్లా గూడూరులో దసరా ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, జాటోతు హుస్సేన్‌నాయక్



హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు



హనుమకొండ పద్మాక్షి ఆలయం వద్ద రావణ ప్రతిమకు నిప్పంటిస్తున్న ఎమ్మెల్యే నాయిని



ఉర్సు రంగలీలా మైదానంలో మిరుమిట్లు గొల్పుతున్న తారాజువ్వలు



మెడకు తాడు బిగించి చంపి

- గరిటతో మృతదేహం మర్మాంగాలను కాల్చిన భార్య
- పెనుగొండలో భర్తను హత్య చేసిన భార్య, అత్త, బావమరిది
- పోలీసులకు సమాచారం అందించిన ఆటోడ్రైవర్
- వీడిన కడప జిల్లా వాసి హత్య కేసు మిస్టరీ



ప్రశాంత్ మృతదేహం

కేసముద్రం, అక్టోబరు 13: కేసముద్రం మండలం పెనుగొండలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప పట్టణానికి చెందిన లక్కే ప్రశాంత్(30)ను ఆయన భార్య, అత్త, బావమరిది కలిసి తాడుతో ఉరివేసి చంపారు. భర్తను చంపిన అనంతరం అతనిపై కసితీరక అట్ల గరిటను వేడిచేసి మర్మాంగాలను భార్య కాల్చింది. ప్రశాంత్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ కేసులో విచారణ అనంతరం మహబూబాబాద్ రూరల్ సర్కిల్ ఇన్‌చార్జ్ గూడూరు సీఐ బాబురావు తెలిపిన ప్రకారం... ఏపీలోని కడప జిల్లాకు చెందిన లక్కే ప్రశాంత్, అదే జిల్లా సింహాద్రిపురం మండలం చెవ్వారిపల్లి గ్రామానికి చెందిన అమినా ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. ఉపాధి కోసం కడప నుంచి నాలుగు నెలల క్రితం భార్య, పిల్లలతో కలిసి ప్రశాంత్ పెనుగొండలో భవన నిర్మాణ పని చేసేందుకు వచ్చాడు. అమినాకు రెండో పెళ్లి కావడంతో భర్త ప్రశాంత్ అనుమానిస్తూ పిల్లలు నాకు పుట్టలేదు అంటూ నిత్యం మద్యం సేవించి వచ్చి ఆమెను కొడుతుంటాడు. ఈ క్రమంలో తనను నిత్యం శారీరక, మానసిక హింసకు గురిచేస్తున్నాడని, ఇదే గ్రామంలో ఉంటున్న కడప జిల్లా పులివెందుల మండలం ఎర్రగుడిపల్లికి చెందిన అమినా తల్లి కడియాల నూర్జహాన్, సోదరుడు కడియాల అమర్‌భాషాలకు తన గోడు వెల్లబోసుకుంది. ప్రశాంత్ తనను, పిల్లలను, అవసరమైతే మిమ్మల్ని కూడా చంపుతాన ని బెదిరిస్తున్నాడని అమినా తల్లి, సోదరునికి తెలిపింది. ఈ క్రమంలో ప్రశాంత్‌ను చంపాలని ముగ్గురు కలిసి నిర్ణయించుకొని ఈనెల 10న అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల ప్రాంతంలో తాడుతో ప్రశాంత్ మెడకు ఉరిపెట్టి చంపారు. అయినా కసి తీరక అమినా అట్ల గరిట(సరాతం)ను స్టౌపై వేడి చేసి తన భర్త ప్రశాంత్ మర్మాంగంపై కాల్చింది. ఆ తర్వాత గ్రామంలో ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని రైల్వేట్రాక్‌పై పడవేయాలని నిర్ణయించుకొని వారికి తెలిసిన మహబూబాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ రామును పిలిచారు. ఆటో డ్రైవర్‌ను మభ్యపెట్టి మృతదేహాన్ని ఆటోలో రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా డ్రైవర్ రాముకు అనుమానం వచ్చి, వారిని నిలదీయగా హత్య విషయం బయటపడింది. దీంతో రాము వెంటనే 100 ద్వారా పోలీసులకు, 108కు సమాచారం అందించాడు. 108 సిబ్బంది ప్రశాంత్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

సమాచారం అందుకున్న పోలీసులు నిందితులు అమినా, నూర్జహాన్, అమర్‌భాషాలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించిన ఆటో డ్రైవర్ రామును, కేసు దర్యాప్తును వేగవంతంగా చేసిన ఎస్ఐ మురళీధర్‌రాజ్‌ను జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినందించారు.

ఇమ్మడి వారి నాలుగు తరాల
ఉమ్మడి దసరా వేడుకలు



వరంగల్ ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా వేడుకల్లో నాలుగు తరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 13: ఇమ్మడి నాలుగు తరాల ఉమ్మడి కుటుంబసభ్యులు దసరా పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. వరంగల్‌లోని ఇమ్మడి పుల్లయ్య నివాసంలో దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో నాలుగు తరాలకు చెందిన సుమారు 70 మంది నూతన దుస్తులు ధరించి చిన్న..పెద్ద అనే తేడా లేకుండా ఆటా..పాటలతో ఆనందోత్సవాల నడుమ దసరా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్మడి పుల్లయ్య మాట్లాడుతూ...ఇమ్మడి కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఉద్యోగ, ఉపాధిరీత్యా ఇతర ప్రదేశాల్లో నివాసముంటున్నప్పటికీ దసరా పర్వదినాన ఒకే చోట పండుగ జరుపుకొని కష్ట..సుఖాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

పద్మశ్రీ సమ్మయ్యకు ఘన సన్మానం



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ దత్తాత్రేయ

దేవరుప్పుల, అక్టోబరు 13: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమ్మయ్యను ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, అలయ్ బలయ్ చైర్మన్ విజయలక్ష్మిలు ఘనంగా సన్మానించి సత్కరించారు. గవర్నర్ దత్తాత్రేయ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగనున్న అలాయ్ బలాయ్ కార్యక్రమానికి సమయ్యను ఆహ్వానించగా ఆయన హాజరయ్యారు. కార్యక్ర మంలో సమ్మయ్య కుమారుడు హిమగిరి పాల్గొన్నారు.

పాత కక్షలతో యువకుడిపై కత్తితో దాడి

జఫర్‌గడ్, అక్టోబరు 13: మండలంలోని కూనూరులో సామల రంజిత్ అనే వ్యక్తిపై ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ బానోత్ రాంచరణ్ నాయక్ తెలిపిన ప్రకారం శనివారం సాయంత్రం గ్రామంలో జరిగిన దసరా ఉత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులతో కలిసి సామల రంజిత్ వీక్షిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన ముక్కెర గణేష్ పాత గొడవలను మనసులో పెట్టుకుని ఆగ్రహంతో కందుల శివకుమార్, ఇల్లందుల రాజేశ్‌ల సహకారంతో రంజిత్‌పై దాడి చేసి కత్తితో పొడిచి పారిపోయాడు. దీంతో కత్తిపోటుకు గురై కింద పడిపోయిన రంజిత్‌ను చికిత్స నిమిత్తం హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. రంజిత్ తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, యువకుడి పరిస్థితి నిలకడగానే ఉందని బంధువులు తెలిపారు.

బయ్యారంలో విందు భోజనం

- కొత్త అల్లుడికి 66 రకాలతో వంటకాలు
- ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయం తెలంగాణలోనూ..
- స్వరాష్ట్రంలో ప్రప్రథమంగా దసరాకు శ్రీకారం



బయ్యారం(మహబూబాబాద్ జిల్లా), అక్టోబరు 13 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ దసరా పండుగను పురస్కరించుకొని బయ్యారంలో ఓ కుటుంబం కొత్త అల్లుడికి రకరకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. ఆంధ్ర సంక్రాంతి సంప్రదాయాన్ని తెలంగాణలోనూ దసరాకు శ్రీకారం చుట్టిన ఆ కుటుంబం 66 రకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేసి ఔరా.. అనిపించుకున్నారు. వివరాల్లోకి వెళితే...

వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన కల్లూరి రమేష్-కల్పన దంపతుల కూతురు శ్వేతకు ఆగస్టు 28న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వంశీతో వివాహమైంది. తెలంగాణ ఆచార సంప్రదాయం ప్రకారం వివాహమైన తరువాత వచ్చే తొలి దసరా, ఉగాది పండుగలను ఛేదు పండుగలుగా భావించి, అత్త ఇంటి వారు కొత్త అల్లుడిని ఇంటికి తీసుకరారు. దీంతో బయ్యారంలో ఉంటున్న శ్వేత పిన్ని బాబాయి గిరిపెల్లి లావణ్య-వేణు కుటుంబం నూతన దంపతులైన శ్వేత, వంశీలను దసరా పండుగకు ఆహ్వానించారు. ప్రతీ ఏడాది ఆంధ్ర రాష్ట్రంలో తొలి సంక్రాంతికి వచ్చే కొత్త అల్లుడికి అత్తింటి వారు రకరకాల వంటకాలతో భోజనం ఏర్పాటు చేస్తున్న విషయాన్ని గమనంలో ఉంచుకున్న వేణు-లావణ్య దంపతులు తెలంగాణలోనూ ఆంధ్ర తరహా కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని భావించారు. అందులో భాగంగా శనివారం దసరా పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి 66 రకాల వంటకాలతో విందుభోజనం ఏర్పాటు చేశారు. వేణు కుటుంబం స్వరాష్ట్రంలో ఇలా నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టి కొత్త అల్లుడికి విందుభోజనం ఏర్పాటు చేసిన తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి చర్చనీయాంశమైంది.

గార్లలో జాతీయ జెండా ఆవిష్కరణ



గార్ల, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని మసీదు సెంటర్లలో ఎంపీడీవో మంగమ్మ శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి జెండాను డప్పువాయుద్యాలతో గార్లలోని వీధుల్లో ఊరేగించారు. నైజాం నవాబుల కాలంలో దసరా రోజున నెలవంక ఉన్న నీలిరంగు జెండాను ఎగరవేయడం ఆనవాయితీగా వస్తుంది. నాటి నుంచి ఏటా దసరా పండుగ రోజు గార్ల మసీదు సెంటర్‌లో జాతీయ జెండాను పట్టణ మొదటి పౌరుడు ఎగర వేస్తారు. దేశంలో ఎక్కడాలేని విధంగా విజయ దశమిరోజు జెండాను ఆవిష్కరిస్తారు. 75 ఏళ్లుగా జెండాను ఎగరవేయడం జరుగుతుంది. 1952లో గార్ల టౌన్ మునిసిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ చైర్మన్‌గా మాటేటి కిషన్‌రావు ఎన్నికయ్యాడు. నాడు దసరా రోజున మసీదు సెంటర్‌లో కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తుండగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ విషయంపై హైకోర్టుకు వెళ్లారు. దైవభక్తికి చిహ్నం మత సామరస్యానికి ప్రతీకగా జాతీయ జెండాను ఎగరవేయాలని తీర్పు ఇచ్చింది. నాటి నుంచి సర్పంచ్ చేతుల మీదుగా దసరా పండుగ రోజు జాతీయ జెండా ఎగరవేయడం జరుగుతుంది. సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో మండల ప్రత్యేక అధికారి ఎంపీడీవో మంగమ్మ చేతుల మీదుగా జెండా ఎగరవేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు అజ్మీరా బస్సీలాల్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
● వరంగల్ ● ఖిలావరంగల్
సోమవారం 14 అక్టోబరు 2024





మధుసూదనాచారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరేందర్

మధుసూదనాచారిని కలిసిన మాజీ ఎమ్మెల్యే

మట్టెవాడ, అక్టోబరు 13: తెలంగాణ రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నేతగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సిరికొండ మధుసూదనాచారిని మాజీ ఎమ్మెల్యే నరేందర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నరేందర్ హైదరాబాద్‌లో సిరికొండను కలిసి బొకే అందించారు. అదే విధంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావును సైతం మర్యాదపూర్వకంగా దసరా శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరాముడు చూపిన మార్గంలో నడుస్తాం




విశ్వనాథకాలనీలో జమ్మి పూజలో పాల్గొన్న ప్రదీప్‌రావు

శంభునిపేట, అక్టోబరు 13: శ్రీరాముడు చూపిన ధర్మ మార్గంలోనే నడుస్తామని బీజేపీ నాయకుడు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. 41వ డివిజన్ విశ్వనాథకాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్ని రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ప్రదీప్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, కార్పొరేటర్ పోశాల, పద్మస్వామిలు పాల్గొని మాట్లాడారు. ఏ యుగంలో అయినా, ఏ ప్రాంతంలో అయినా చెడుపై మంచి గెలుస్తుందని ప్రదీప్ రావు అన్నారు. కార్యక్రమంలో సిద్ధం నరేష్, కొంతం మోహన్, శెంకేశి లింగమూర్తి, సత్యనారాయణ, సాంబయ్య, వాసుదేవ్, సదానందం, సురేష్, రవికుమార్, సుభాష్, సురేందర్, శ్రీనివాస్, సుధాకర్, దేవేందర్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు స్థలం కేటాయిస్తాం : మంత్రి

కాశిబుగ్గ, అక్టోబరు 13: కాశిబుగ్గలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు శాశ్వత స్థలం కేటాయిస్తామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. శనివారం దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పద్మనగర్ ప్రాంతంలోని చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద జరిగిన రావణవధ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మిరుమిట్లు గొలుపే బాణసంచా ఆకట్టుకుంది. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేందర్, ఓని స్వర్ణలతబాస్కర్, తూర్పాటి సులోచనసారయ్య, ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్ గుళ్లపల్లి రాజ్‌కుమార్, కన్వీనర్ బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, కోశాధికారులు నవీన్, ఓంప్రకాష్ ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, బాకం హరిశంకర్, కాంగ్రెస్ నేతలు నవీన్ రాజ్, దాసరి రాజేష్, బీజేపీ నేత వన్నాల శ్రీరాములు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద దహనమవుతున్న రావణ ప్రతిమ

ఘనంగా దసరా వేడుకలు

శంభునిపేట, అక్టోబరు 13: నగరంలో శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. రంగశాయిపేటలో రావణవధ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మనం జరుపుకునే పండుగల్లోనే మన సాంప్రదాయాలు ఉన్నాయని వాటిని కొనసాగించటం మన బాధ్యతని గుర్తుచేశారు. విజయ దశమి రోజున జమ్మి పూజ చేసుకొని పాలపిట్టను దర్శించుకోవటం మన సాంప్రదాయం అన్నారు. ప్రస్తుతం పాలపిట్టలు అంతరించి పోతున్నాయని అన్నారు. పాలపిట్టల సంరక్షణ కొరకు వన్యప్రాణుల సంరక్షణ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. మేయర్ గుండు సుధారాణి, జగిత్యాల జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కంచ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు శెంకేశి శంకర్‌రావు, కాంగ్రెస్ నాయకులు గోపాల. నవీన్‌రాజ్, కార్పొరేటర్‌లు గుండు చందనపూర్ణచందర్, పోశాల పద్మస్వామి, మాజీ కార్పొరేటర్ కేడల పద్మజనార్దన్‌లు పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మిరుమిట్లు గొలిపే బాణాసంచా, విద్యుదీపాల అలంకరణ అలరించింది. దసరా ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్యాదర్శి దామెరకొండ కర్ణాకర్ ముత్తినేని రామ్మూర్తి, కొక్కొండ భాస్కర్, పరికిపండ్ల రాజేశ్వర్, మండల లక్ష్మయ్య, బీవీ. రామకృష్ణప్రసాద్, కోట శ్రీధర్‌కుమార్, నాయిని అశోక్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: నగరంలో శనివారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. ఖిలావరంగల్ తూర్పుకోటలో రావణవధ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాణాసంచాతో పిల్లలు పెద్దలు కేరింతలు పెట్టారు. అనంతరం ఉత్సవాలకు సహకరించిన దాతలను సన్మానించారు. కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్, మాజీ కార్పొరేటర్ అచ్చ లక్ష్మిలు మాట్లాడుతూ ఇది చెడుపై మంచికి విజయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు బోగి సురేష్, సభ్యులు కందిమళ్ల మహేష్, బోయిని దూడయ్య, బెడిద వీరన్న, వనపర్తి ధర్మరాజు, గన్నారపు రమేష్, సంగరబోయిన చందర్, జగదీష్, అర్షం రాంబాబు పాల్గొన్నారు. శివనగర్‌లో పుప్పాలగుట్ట ముత్యాలమ్మ దేవాలయం నుంచి జమ్మిని మెరుగు అశోక్, ఖడ్గ దారణ గడ్డం రవిలు చేయగా కార్పొరేటర్‌లు దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్‌లు రావణవద ప్రతిమకు నిప్పుపెట్టారు. కొత్తపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన రావణవద కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ నాయకులు అనుమాండ్ల నగేష్, మర్రి శ్రీనివాస్, రేణికుంట్ల శివ, కానుగంటి స్వామి, కర్నాల సత్యం, సారా సాంబయ్య, తుంగ నర్సింగం, గడ్డం సుధాకర్ పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండగ జరుపుకుంటామని మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ అన్నారు. పైడిపెల్లిలో శనివారం దసరా వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో బొడ్రాయి, అనంతరం జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జన్ను అనిల్‌కుమార్, జన్ను రాజయ్య ఇట్యాల సతీష్, జన్ను సారంగపాణి, లింగం మూర్తి, కూనమళ్ల సారంగపాణి, కంది రాజేందర్, కసివోజ్జల పూర్ణచంద్రాచారి పాల్గొన్నారు.

● కాశిబుగ్గ: నర్సంపేట రోడ్డులోని శ్రీ కనకదుర్గ మాత ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీహోమం శ్రీధరాచార్యుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. జమ్మి చెట్టుకు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్, సభ్యులు సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వర్యా సురేష్ కుమార్, సరోజన, వెంకటేశ్వర్ రావు, వేణు, ప్రభాకర్, శారద తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పలుచోట్ల రావణవధ

ఆకట్టుకున్న బాణాసంచా



రంగశాయిపేటలో రావణ ప్రతిమ



పుప్పాలగుట్ట ముత్యాలమ్మ దేవాలయం నుంచి జమ్మిని తీసుకువస్తున్న నిర్వాహకులు



రంగశాయిపేటలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ






పైడిపెల్లిలో దసరా వేడుకలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్



శివనగర్‌లో రావణ వధలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ కుమారస్వామి



కనకదుర్గ మాత ఆలయంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు



రావణవధ.. ఓరుగల్లు ఫిదా..

(5వ పేజీ తరువాయి)

దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేసిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ కమిషనర్, సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ దేశంలోనే దసరా వేడుకలకు రెండో ప్రాంతంగా వరంగల్ ప్రసిద్ధిగాంచడం చాలా గొప్ప విషయమన్నారు. శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య మాట్లాడుతూ దసరా వేడుకలను గత 80 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఈ దసరా ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శాసన మండలి ఉప సభాపతి బండా ప్రకాష్ మాట్లాడుతూ భారతదేశంలో మైసూర్ తరువాత అంతటి ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించేది మన వరంగల్ ప్రాంతంలోనే అన్నారు. వేడుకల్లో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మస్వామి, పల్లం పద్మ రవి, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, దసరా ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు గంటన్నర పాటు కొనసాగాయి. ఈసందర్భంగా వివిధరకాల బాణాసంచా ఆకట్టుకుంది.

పోలీసుల వైఫల్యం..

పోలీసు బందోబస్తు పూర్తిగా వైఫల్యమైంది. ప్రజలను నియంత్రించి, మళ్లించే క్రమంలో పోలీసులు కావాల్సినంత మంది లేకపోవడం, ఉన్న పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో రావణవధ వేదిక వద్దకు ప్రజలు వందల సంఖ్యలో చేరుకున్నారు. మంత్రి సురేఖతోపాటు ఇతర అతిథులు వాహనాలు లోనికి వచ్చే అవకాశం లేకుండా పోయింది, పలుమార్లు వేదిక నుంచి కమిటీ సభ్యులు పోలీసులు వచ్చి అతిధులకు దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ కోరినా పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు. వేడుకలను తిలకించేందుకు వేలాది మంది తరలిరావడంతో పార్కింగ్‌కు వచ్చే వందలాది వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

ఉత్సవ కమిటీ నిర్వహణ లోపం

వేడుకల్లో ఉత్సవ కమిటీ నిర్వహణ లోపం స్పష్టంగా కనిపించింది. పాసులు ఉన్న వారికి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసినా అందులో సాధారణ పాసులు లేని వారే కూర్చోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు. ఇక మీడియా సభ్యులకు సైతం పాస్‌లు జారీ చేయకపోవడంతో వేడుకలను కవర్ చేసేందుకు వచ్చినవారు సైతంలోనికి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

ఎవరు ఈ నవీన్‌రాజ్?

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2024 ఉత్సవాల నిర్వహణ పేరుతో శనివారం రంగలీలా మైదానంలో జమా ఖర్చులకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కరపత్రాల్లో ఎన్నడూ లేనివిధంగా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గోపాల నవీన్ రాజు పేరు ఉండటంతో కరపత్రాలను చదివిన ప్రజలు అసలు ఈ నవీన్‌రాజ్ ఎవరూ అంటూ ప్రశ్నించుకున్నారు. నవీన్‌రాజ్ పేరును కమిటీలో చేర్చడంతో ఉత్సవ కమిటీలో రాజకీయ జోక్యం ఉందని స్పష్టంగా కనిపించింది. నవీన్‌రాజ్ వల్లే ఇటీవలే ఓ పోలీసు అధికారి ఉద్యోగానికి ఎసరు వచ్చిందని, మళ్లీ ఈ ఉత్సవ కమిటీలో ఇతని పేరుతో ఉత్సవాలు రాజకీయరంగును పులుముకున్నాయని పలువురు చర్చించుకున్నారు.



ఉర్సు రంగలీలా మైదానంలో రావణాసుర వధ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు

కోటలో సాయిబాబాకు నివాళి

ఖిలావరంగల్, అక్టోబరు 13: ప్రజా ఉద్యమాలకు దిక్సూచి, తెలంగాణ ప్రజాస్వామిక సాహితీకుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతి తీరని లోటని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘం(టాకాస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల నాగరాజు అన్నారు. ఆదివారం ఖిలావరంగల్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సాయిబాబాకు నివాళులర్పించారు. సాయిబాబాను బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల జైల్లో నిర్బంధించి, అనేక బాధలు పెట్టినా, ఆయన భార్య, కుమార్తె, సహచరులు చేసిన న్యాయపోరాటం ఫలితంగా ఆయన ఇటీవల విడుదల అయ్యారన్నారు. శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందడం విషాదాన్ని నింపిందన్నారు. కార్యక్రమంలో టాకాస్, వివిధ ప్రజాసంఘాల నాయకులు మైదం బాబు, శ్యాంసుందర్, మైదం పాణి, సీపీఐ ఎంఎల్, మాస్‌లైన్ జిల్లా అధ్యక్షుడు భైరబోయిన అయిలయ్య, ఐఎఫ్‌టీయు జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి రాజన్‌బాబు, ఆకుల కుమారస్వామి, రమేష్, రవి, నలిగంటి ప్రేమ్‌సాగర్, గజ్జ చందు, బెల్లంకొండ కరుణాకర్, ఎమ్డీ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబాకు నివాళులర్పిస్తున్న టకాస్ నాయకులు

కాలభైరవ ఆలయంలో ప్రత్యంగిర హోమం



ఆలయంలో ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గిర్మాజిపేట, అక్టోబరు 13: గోవిందరాజస్వామి ఆలయం మెట్ల మార్గంలోని కాలభైరవ స్వామి ఆలయంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల చివరి రోజైన శనివారం ప్రత్యంగిర హోమం, షమి, ఆయుధ పూజ నిర్వహించారు. చింతాకుల సునీల్ కుమార్, కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్‌లు హోమం నిర్వహించి పూర్ణాహోతి చేశారు.

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

శంభునిపేట, అక్టోబరు 13 : శరన్నవరాత్రులు పూజలందుకున్న అమ్మవారిని గంగమ్మ ఒడికి చేర్చారు. రంగశాయిపేటలో అమ్మవారి మంటపాలను ఏర్పాటు చేసి 10 రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం కనకదుర్గా అమ్మవారిని బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. శివపుత్ర యూత్, గాంధీ విగ్రహం వద్ద వీర హనుమాన్ యూత్, రామాలయంలో శ్రీరామ భజన మండలి మహిళా విభాగం, హనుమాన్ ఆలయంలో హనుమాన్ యూత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర వైభవోపేతంగా కొనసాగింది.

కాసం ఫ్యాషన్స్ బంపర్ డ్రాలు

» ఊరికో బైక్ చొప్పున ముగ్గురు విజేతల ఎంపిక

హనుమకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాసం ఫ్యాషన్స్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రతీ ఊరికి ఒక బైక్ కింద ఆదివారం బంపర్ డ్రాలు తీసి విజేతలకు బహుమతులను ప్రకటించింది. కాసం ఫ్యాషన్స్ హనుమకొండ దసరా మహోత్సవంలో భాగంగా నిర్వహించిన డ్రా కార్యక్రమంలో వ్యాపారవేత్త ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్రా తీశారు. బపర్ డ్రా విజేతగా మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణ (కూపన్ సీఏ32009911/10/24-2) విజేతగా నిలిచారు. అలాగే కాసం ఫ్యాషన్స్ పరకాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యాపారవేత్త పిట్ట ప్రకాశం డ్రా తీసి విజేతను ప్రకటించారు. బంపర్ డ్రా విజేతగా నాగారంకు చెందిన సునీత (కూపన్ సీఏ30032291/10/24) నిలిచారు. అలాగే కాసం ఫ్యాషన్స్ మహబూబాబాద్‌లో నిర్వహించిన డ్రాలో బంపర్ డ్రా విజేతగా మహబూబాబాద్ కాకతీయ కాలనీకి చెందిన జె ప్రశాంత్ (కూపన్ సీఏ41067547 /10/24) విజేతగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి

శంభునిపేట, అక్టోబరు 13 : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన మామునూరు పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రమేష్ కథనం ప్రకారం... మామునూరులోని బీసీ గురుకులం వద్ద శుక్రవారం రాత్రి జాతీయ రహదారిపై ఓ మహిళ మృతదేహం నుజ్జునుజ్జు అయి ఉండటంతో వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కృష్ణవేణి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఛిద్రమై ఉంది. మహిళకు ఎర్ర రంగు చీర ఉన్నట్లు గమనించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. సంబంధీకులు మామునూరు పోలీసులను సంప్రదించాలని సీఐ రమేష్ తెలిపారు.

ప్రమాదమా... హత్యా..?

గుర్తు తెలియని మహిళ నిజంగానే రోడ్డు ప్రమాదంలో మరణించిందా. లేక ఎవరైనా హత్య చేసి తీసుకువచ్చారా అన్న అనుమానాలను స్థానికులు వ్యక్తపరుస్తున్నారు. మహిళ ఒంటరిగా రాత్రి వేళలో ఆ ప్రదేశానికి ఎందుకు వచ్చిందనే చర్చసాగుతోంది. మృతదేహం రోడ్డు పైనే నుజ్జునుజ్జు కావటంతో ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ సైతం గుర్తించలేకపోవటం వెనుక ఏమైనా హత్యాకోణం దాగి ఉందా అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మహిళను ఎక్కడైనా హత్య చేసి చీకటిగా ఉండే ప్రాంతంలో జాతీయ రహదారిపై పడేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జ్యోతిరావు పూలే విగ్రహం ధ్వంసం

పోచమ్మమైదాన్, అక్టోబరు 13: దేశాయిపేట ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఆదివారం తెల్లవారుజామున విగ్రహం ధ్వంసమై ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ఇంతేజార్‌గంజ్ సీఐ షుకూర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరాంనాయక్ మాట్లాడుతూ దోషులను గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, ధ్వంసమైన విగ్రహాన్ని పోలీసులు హుటాహుటిన తొలగించారు. స్థానిక నాయకులు, సంఘాల ప్రతినిధులతో మాట్లాడి కొత్త విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త పాలడుగుల సురేందర్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ధ్వంసమైన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం

విగ్రహాన్ని కూల్చిన దుండగులను శిక్షించాలి

దేశాయిపేటలో పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేసిన జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆదివారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు పరిశీలించి, నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పోలీసు దుండగులను గుర్తించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు కురిమిళ్ల శ్రీనివాస్, కార్యదర్శి సాంబరాజు, విక్రం, కొడారి అనిల్, సంతోష్ పాల్గొన్నారు.



మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పిస్తున్న ఏసీపీ నందిరాం



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 14 అక్టోబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

వార్డులను పట్టించుకోవడం లేదని ఆందోళన



ఆందోళన చేస్తున్న వార్డుల ప్రజలు

వర్ధన్నపేట, అక్టోబరు 13 : లక్షల రూపాయలు పన్నుల రూపేణా వసూలు చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు, పాలక మండలి సమస్యలను పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనచేపట్టిన ఘటన శనివారం సాయంత్రం పట్టణంలోని ఫిరంగిగడ్డ ప్రాంతంలో చోటుచేసుంది. వివరాల్లోకి వెళితే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారి, బొడ్రాయి వరకు విద్యుత్ కాంతులతో మెరుస్తుండగా పట్టణంలోని 7, 8, 12 వార్డుల్లో లైట్లు వేయడం లేదని, చెత్తసేకరణ, పారిశుధ్య సమస్యను పరిష్కరించడంలేదని ఆగ్రహిస్తూ స్థానికులు జఫర్‌గడ్ రోడ్డుపై బైఠాయించి మునిసి పల్ అధికారులు, పాలక మండలికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బైఠాయించారు. దీంతో పోలీసులు వెంటనే ఆందోళన స్థలానికి చేరుకుని వారికి సర్ది చెప్పి పంపించారు.

రాజరాజేశ్వరస్వామి ఆలయంలో చోరీ



సీసీ కెమెరాల్లో రికార్డైన గుర్తు తెలియని వ్యక్తులు

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 13 : మండలంలోని ఇల్లంద గ్రామ శివారు ఆకేరు వాగు సమీపంలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్‌ఐ చందర్ కథనం ప్రకారం... ఇల్లంద శివారులోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం ద్వారం తాళాలు పగల గొట్టి చొరబడ్డారు. ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి అందులో ఉన్న కానుకలను తీసుకెళ్లి, ఆ హుండీని పొలాల్లో వేశారు. ఇప్పటికే సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యా లను పరిశీలించారు. దసరా ఉత్సవాల సందర్భంగా పోలీసులు బందోస్తుకు వెళ్తార నే ఆలోచనతో దొంగతనం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దీని పై కేసు నమోదు చేసిన విచారణ చేస్తున్నామని, ఆలయ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్లూస్ టీంతో దుండగుల ఆధారాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ చందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ మేరుగు రాజు, సిబ్బంది సురేష్, పాషా, శ్రావణ్, అశోక్ పాల్గొన్నారు.

బావిలో పడి మునిగిన ట్రాక్టర్

• త్రుటిలో తప్పించుకున్న డ్రైవర్

సంగెం, అక్టోబరు 13 : మండలంలోని ఆశాలపల్లి బస్టాండ్ సమీపంలో వ్యవసాయ బావిలో ట్రాక్టర్ పడి మునిగిపోయిన ఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం కొంకపాకకు మదాచీ రాహుల్ శనివారం రాత్రి ఇంటినుంచి ట్రాక్టర్ (నంబరులేని)లో బయలు వరంగల్‌లోని బంధువుల ఇంటికి బయలు దేరాడు. ఆశాలపల్లి బస్టాండ్ సమీపంలో రోడ్డును అనుకుని ఉన్న వ్యవసాయ బావి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి బావి చుట్టూ బిగించి ఉన్న ఇనుప కంచెను ఢీకొని ట్రాక్టర్ బావిలో పడింది. డ్రైవింగ్ చేస్తున్న రాహుల్ సైతం బావిలో పడి చాకచక్యంగా అదే రోజు రాత్రి బావినుంచి పైకి చెట్ల వేరును పట్టుకొని వచ్చాడు. కాపులకనపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లి విషయం చెప్పగా, బావిలో నుంచి ట్రాక్టర్‌ను తీసేందుకు ప్రయత్నించారు. ఆదివారం సమాచారం అందుకున్న సంగెం ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి బావి వద్దకు వచ్చి బావిలోని మోటార్ల ద్వారా నీటీని తోడేందుకు ప్రయత్నాలు చేశారు. కాగా, రాహుల్‌కు గాయాలు కావడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు రాహుల్ కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి



రమేష్ (ఫైల్)

నెక్కొండ, అక్టోబరు 13 : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని రెడ్లవాడలో ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. గ్రామస్థులు, ఎస్సై మహేందర్ కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన నీరటీ రమేష్(39) అనే వ్యక్తి జనగామ జిల్లా తిరుమలగిరిలో చిరు వ్యాపారం చేసుకుంటూ జీనవం కొనసాగిస్తున్నాడు. దసరా పండుగకు తన సొంత గ్రామమైన రెడ్లవాడకు వచ్చాడు. ఆదివారం తెల్లవారు జామున ఊరకుంట్ల చెరువు దగ్గరకు చేపలను పట్టడానికి వెళ్లాడు. చెరువులో దిగి చేపలు పడుతున్న క్రమంలో రమేష్‌కు చేపల వల ప్రమాదవశాత్తు కాళ్లకు చుట్టుకోవటంతో చెరువులో మునిగి మృతి చెందాడు. తోటి జాలర్లు గమనించి మృతుడు రమేష్‌ను ఒడ్డుకు చేర్చారు. మృతుడికి భార్య అమృత, ఇద్దరు పిల్లలలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, పండుగకు సొంత గ్రామానికి వచ్చి రమేష్ మృతి చెండడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ముగిసిన విజయ దశమి వేడుకలు



నర్సంపేట అంగడిలో కాలుతున్న రావణాసుర ప్రతిమ



రాయపర్తి రామాలయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పర్వతగిరిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే నాగరాజు



సంగెం పోలీస్‌స్టేషన్‌లో పూజలు చేస్తున్న ఎస్సై నరేష్

నర్సంపేట, అక్టోబరు 13 : దసరా (విజయ దశమి) పండగ వేడుకలను శనివారం ఆనందోత్సాహాల మధ్య ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మాత మహిషాసురుడిని సంహరించి విజయం సాధించిన కారణంగా ప్రతీ ఏటా విజయదశమిన దసరా వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో జమ్మిచెట్టు కొమ్మలకు పూజలను ఆలయ కమిటీ చైర్మెన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులతో అర్చకులు ముదుంబై మాధవాచార్యులు పూజలు చేయించారు. అనంత రం అర్చకుడు అయిపవోలు కృష్ణమూర్తి శర్మ వేదమంత్రోచ్చరణల మధ్య గ్రామ దేవత (బొడ్రాయి) వద్ద ప్రముఖులచే పూజలు చేయించారు. స్థానిక వేంకటేశ్వరాలయం సమీపంలోగల బండరాయికి పూజలు నిర్వహించి తదుపరి జంతుబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. మునిసిపల్ ఆధ్వర్యంలో బాణాసంచాతో తయారు చేసిన నాగుపాము, పూలపందిరి వంటి ఆకృతులను, రావణాసుర విగ్రహాన్ని మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కౌన్సిలర్లు నిప్పంటించి దహనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ రమణమూర్తి, ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేయించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వేముల సాంబయ్యగౌడ్, బత్తిని రాజేందర్, ఎలకంటి రాజేందర్, పెండెం లక్ష్మి, దార్ల రమాదేవి, ఓర్సు అంజలి, బానాల ఇందిర. గంప సునీత, దేవోజు తిరుమల, కో-ఆప్షన్ సభ్యులు ఎండీ యాకూబ్‌పాషా, నాయినిసునీతతో పాటు ఇతర కౌన్సిలర్లు, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, పాలాయి రవి, ఎర్రయాకూబ్‌రెడ్డి దండెం రథన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు నల్లమనోహర్‌రెడ్డి, నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, పుల్లూరిస్వామి, గుంటి కిషన్, కాంగ్రెస్, టీఆర్ఎస్ ఇతర పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు, మహిళలు యువతీయువకులు పాల్గొన్నారు. ఆచారం ప్రకారం గంగపుత్ర సంఘంలో జమ్మిచెట్టుకు అర్చకులచే సంఘ సభ్యులతో పూజలు చేశాక జమ్మిచెట్టును దసరా వేడుకల స్థలం వద్దకు తెచ్చి అక్కడ పూజలు జరిపాక జనం జమ్మి ఆకును తెంపుకొని ఒకరికి ఒకరు అందించి పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

• వర్ధన్నపేట: దసరా పర్వదిన వేడుకలు పట్టణ కేంద్రంలో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చైర్‌పర్సన్ అంగోత్ అరుణ, కౌన్సిల్ సభ్యులు కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బొడ్రాయి వద్ద నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులు గోపాలచార్యులు ఆధ్వర్యంలో పూజాలు ముగిసిన అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా రంగలీల మైదానానికి తరలివెళ్లారు. అక్కడ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, రావణ వధ ప్రజలను ఎంతగానో అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఆయా గ్రామాల్లో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి, జమ్మి చెట్టుకు శమీ పూజలు నిర్వహించారు. గ్రామ బొడ్రాయి వద్ద దసరా వేడుకలు నిర్వహించారు. ఇల్లందలో ఏర్పాటుచేసిన రావణ వధ లో ప్రజలు భారీగా పాల్గొన్నారు. స్థానికంగా తక్కళ్లపెల్లి దుర్గారావు ఆధ్వర్యం లో సైతం దసరా వేడుకలు జరిగాయి.

• చెన్నారావుపేట : మండలవ్యాప్తంగా దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బొండ్రాయి సెంటర్, కట్టయ్యపల్లె, ఈర్యతండాల్లో దసరా ఉత్సవాలల్లో హంస మహేందర్ సోరకాయను కట్‌చేసి ఘనంగా ఉత్సవాలను ప్రారంభించారు. అలాగే ఎస్సై రాజేష్‌రెడ్డి సిబ్బందితో పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజను చేపట్టారు. సిద్దేశ్వరాలయం, పోచమ్మ ఆలయాల్లో గ్రామస్థులు జమ్మి చెట్టు వద్ద పూజలను నిర్వహించారు. దసరా వేడుకలకు ఇబ్బందులు కలుగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

• దుగ్గొండి : మండల వ్యాప్తంగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వ హించారు. దుగ్గొండిలో రావణవధ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిలకించడానికి ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

• నెక్కొండ : మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని బొండ్రాయి వద్ద ఆయుధ పూజలను నిర్వహించారు. నెక్కొండ మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో జరిగిన ఆయుధ పూజలల్లో సీఐ చంద్రమోహన్, ఎస్సై మహేందర్ ఆయుధ పూజలను నిర్వహించారు. నక్షత్ర యూత్ ఆధ్వర్యంలో అంగడి సెంటర్‌లో రావణ వధ కార్యక్రమాన్ని నిర్వహించారు.

• పర్వతగిరి: విజయదశమి వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళ బొడ్రాయిలు, జమ్మిచెట్ల వద్ద పూజలు నిర్వహించి రావణాసుర విగ్రహాలను దహనం చేశారు. మండల కేంద్రంతో పాటు కల్లెడ, అన్నారం, ఏనుగల్లులో రావణసుర వధ కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలుకమ్మ చెరువులో దుర్గా మాత తెప్పోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణాసంచా వెలుగుల్లో జరిగిన తెప్పోత్సవాన్ని గ్రామస్థులు తిలకించారు. మండల కేంద్రంలో నిర్వహించిన దసరా వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. బొడ్రాయి వద్ద వేడుకల్లో పాల్గొని జమ్మిచెట్టువద్ద పూజలు చేశారు.

• రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రావణ వధ వేడుకల్లో భారీగా ప్రజలు పాల్గొన్నారు. గ్రామ ప్రధాన ఆలయాల్లో, బొడ్రాయిల వద్ద జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, భక్తులు మొక్కులు చెల్లించారు. మండలంలోని కాట్రపెల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత ఉత్సవాల్లో ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. కమిటీ సభ్యులు అమ్మవారి ఉత్సవాలకు సహకరించిన శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించారు. చెడుపై మంచి గెలవడాన్ని సూచిస్తూ విజయదశమి వేడుకలను జరుపుకుంటామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

• సంగెం: సంగెం పోలీస్‌స్టేషన్‌లో దసర పండుగను పురస్కరించుకుని శమిపూజ నిర్వహించారు. గ్రామ పురోహితుడు నాగార్జునశర్మ పోలీస్ స్టేషన్‌లో ఆయుధాలకు, వాహనాలకు పూజలుచేసి కంకనా (బంధనా)లు కట్టారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్ పాల్గొన్నారు. గ్రామాల్లో పండగ వాతవరణం కనిపించింది.

• నల్లబెల్లి : మండలంలో దసరా పండగ వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం నల్లబెల్లిలో రావణవధ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. రావణుడి బొమ్మను తామే దహనం చేస్తామని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. అనంతరం కొందరు వ్యక్తులు మధ్య దాడి జరుగుతున్న క్రమంలో పోలీసులు లాఠీలతో ఆయా వ్యక్తులను చెదరకొట్టారు. దీంతో సద్దుమణిగింది. అనంతరం పరస్పర వ్యక్తులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు.

నల్లబెల్లి పోలీస్ క్వార్టర్స్‌లో షార్ట్ సర్క్యూట్

• మహిళా కానిస్టేబుల్ ధరణికి తీవ్ర గాయాలు

నల్లబెల్లి, అక్టోబరు 13 : నల్లబెల్లి పోలీస్‌క్వార్టర్స్‌లో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసులు కథనం మేరకు.. నల్లబెల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ ధరణి పోలీస్ క్వార్టర్స్‌లో ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం క్వార్టర్స్‌లోని తన రూంకి వెళ్లి బాకెట్‌లో వాటర్ పోసి వేడి చేసుకోనేందుకు హీటర్‌ను పెట్టి రూంలో నిద్రించింది. దీంతో ఒక్కసారిగా హీటర్ వేడెక్కి విద్యుత్ సర్క్యూట్ అయింది. ధరణి కాళ్లు, చేతులకు అగ్ని అంటుకోవడంతో కేకలు వేసింది. తోటి పోలీస్ సిబ్బంది వచ్చి ఆమెను వెంటనే ఓ వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ధరణి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్వార్టర్స్ రూంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదమే జరిగిందా.. మరేదైనా కారణం ఉందా అనేది పోలీస్‌ల విచారణలో తేలనున్నట్లు ఎస్సై ప్రశాంత్ బాబు తెలిపారు.

బహుమతుల పంపిణీ

నర్సంపేట, అక్టోబరు 13 : సద్దుల బతుకమ్మ పండగ సందర్భంగా తీరొక్క పూలతో అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మ విజేతలకు శనివారం రాత్రి బహుమతులను ప్రదానం చేశారు. దసరా పండుగ సందర్భంగా నర్సంపేటలోని అంగడి ఆవరణలోని వేడుకల ప్రదేశంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఏసీపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రమణమూర్తి విజేతలకు బహుమతులను అందజేశారు. రుద్రారపు సరోజన పైడి దంపతులకు ప్రథమ బహుబతిగా షీల్డును, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్ విరాళంగా అందించిన రూ.5వేల పారితోషికాన్ని అందజేశారు. ద్వితీయ బహుమతిని దేవులపల్లి మౌనికకు షీల్డుతో పాటు ఓబీసీసెల్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతి విరాళంగా అందించిన రూ.3,116 పారితోషికం, తృతీయ బహుమతిని కీసరి లక్ష్మికి షీల్డుతో పాటు కౌన్సిలర్ ఎలకంటి విజయ్ అందించిన రూ.2,166లను అందజేశారు కన్సోలేషన్ బహుమతులను నాడెం సరిత, కీసరి స్వరూపలకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఉత్తమ బతుకమ్మల సెలక్షన్ కమిటీ సభ్యుడు జగన్‌మోహన్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నర్సంపేటలో 20న ఏఎస్ఎస్ రాష్ట్ర మహాసభలు

నర్సంపేట,అక్టోబరు 13 : పట్టణంలో ఈ నెల 20న జరిగే అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏఎస్ఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్ పిలుపు నిచ్చారు. నర్సంపేట పట్టణంలోని పాకాలరోడ్‌లో ఆదివారం మహా సభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు 50 ఏళ్లుగా ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారన్నారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, మహిళలు చేస్తున్న పోరాటాలను సమాఖ్య కళాకారులు మద్దతునిస్తున్నారన్నారు. ఈ నెల 20న నర్సంపేటలో జరిగే మహాసభలను విజమవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు సాంబరాతి మల్లేశం, బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు సోల్తి సారయ్య, టీజేఎస్ నాయకుడు సోల్తి సాయికుమార్, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ ఇట్టబోయిన రవి, గట్టికృష్ణ, భోగి సారంగపాణి, పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క తదితరులు పాల్గొన్నారు

కాసం ఫ్యాషన్స్ బంపర్ డ్రాలు

• ఊరికో బైక్ చొప్పున ముగ్గురు విజేతల ఎంపిక

హనుమకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కాసం ఫ్యాషన్స్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రతీ ఊరికి ఒక బైక్ కింద ఆదివారం బంపర్ డ్రాలు తీసి విజేతలకు బహుమతులను ప్రకటించింది. కాసం ఫ్యాషన్స్ హనుమకొండ దసరా మహోత్సవంలో భాగంగా నిర్వహించిన డ్రా కార్యక్రమంలో వ్యాపారవేత్త ప్రవీణ్ ముఖ్య అతిథిగా పాల్గొని డ్రా తీశారు. బపర్ డ్రా విజేతగా మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీనారాయణ (కూపన్ సీఏ32009911/10/24-2) విజేతగా నిలిచారు. అలాగే కాసం ఫ్యాషన్స్ పరకాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వ్యాపారవేత్త పిట్ట ప్రకాశం డ్రా తీసి విజేతను ప్రకటించారు. బంపర్‌డ్రా విజేతగా నాగారానికి చెందిన సునీత (కూపన్ సీఏ30032291/10/24) నిలిచారు. అలాగే కాసం ఫ్యాషన్స్ మహబూబాబాద్‌లో నిర్వహించిన డ్రాలో బంపర్ డ్రా విజేతగా మహబూబాబాద్ కాకతీయ కాలనీకి చెందిన జె.ప్రశాంత్ (కూపన్ సీఏ41067547/10/24) విజేతగా నిలిచారు.

రావణవధ.. ఓరుగల్లు ఫిదా..



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్సీ సారయ్య, సీపీ అంబర్‌కిషోర్ ఝా



రావణవధ

(5వ పేజీ తరువాయి)

దసరా ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేసిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ కమిషనర్, సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ దేశంలోనే దసరా వేడుకలకు రెండో ప్రాంతంగా వరంగల్ ప్రసిద్ధిగాంచడం చాలా గొప్పవిషయమన్నారు. శాసన మండలి సభ్యుడు బస్వ రాజు సారయ్య మాట్లాడుతూ దసరా వేడుక లను 80ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఈ దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు.శాసన మం డలి ఉప సభాపతి బండా ప్రకాష్ మాట్లాడు తూ భారతదేశంలో మైసూర్ తరువాత అంత టి ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించేది మన వరంగల్ ప్రాంతంలోనే అన్నారు. వేడుకల్లో కార్పొరేటర్లు మరుపల్ల రవి, పోశాల పద్మ స్వామి, పల్లం పద్మ రవి, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, దసరా ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, జానపద, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన ఈ సాంస్కృతిక కార్యక్రమాలు గంటన్నరపాటు కొనసాగాయి. ఈసందర్భంగా వివిధ రకాల బాణాసంచా ఆకట్టుకుంది.

పోలీసుల వైఫల్యం..

పోలీసు బందోబస్తు పూర్తిగా వైఫల్యమైంది. ప్రజలను నియంత్రించి, మళ్లించే క్రమంలో పోలీసులు కావాల్సినంత మంది లేకపోవడం, ఉన్న పోలీసులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో రావణవధ వేదిక వద్దకు ప్రజలు వందల సంఖ్యలో చేరుకున్నారు. మంత్రి సురేఖతోపాటు ఇతర అతిథులు వాహనాలు లోనికి వచ్చే అవకాశం లేకుండా పోయింది, పలుమార్లు వేదిక నుంచి కమిటీ సభ్యులు పోలీసులు వచ్చి అతిథులకు దారి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ కోరినా పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు. వేడుకలను తిలకించేందుకు వేలాది మంది తరలిరావడంతో పార్కింగ్‌కు వచ్చే వందలాది వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ, ఎస్సైలు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు.

ఉత్సవ కమిటీ నిర్వహణ లోపం..

వేడుకల్లో ఉత్సవ కమిటీ నిర్వహణ లోపం స్పష్టంగా కనిపించింది. పాసులు ఉన్న వారికి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసినా అందులో సాధారణ పాసులు లేని వారే కూర్చోవడంతో వారు అసహనం వ్యక్తంచేశారు. ఇక మీడియా సభ్యులకు సైతం పాస్‌లు జారీచేయకపోవడంతో వేడుకలను కవర్ చేసేందుకు వచ్చిన వారు సైతం లోనికి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.

ఎవరు ఈ నవీన్‌రాజ్?

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 2024 ఉత్సవాల నిర్వహణ పేరుతో శనివారం రంగలీలా మైదానంలో జమా ఖర్చులకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కరపత్రాల్లో ఎన్నడూ లేనివిధంగా ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా గోపాల నవీన్ రాజు పేరు ఉండటంతో కరపత్రాలను చదివిన ప్రజలు అసలు ఈ నవీన్‌రాజ్ ఎవరూ అంటూ ప్రశ్నించుకున్నారు.నవీన్‌రాజ్ పేరును కమిటీలో చేర్చడంతో ఉత్సవ కమిటీలో రాజకీయ జోక్యం ఉందని స్పష్టంగా కనిపించిది. నవీన్‌రాజ్ వల్లే ఇటీవలే ఓ పోలీసు అధికారి ఉద్యోగానికి ఎసరు వచ్చిందని, మళ్లీ ఈ ఉత్సవ కమిటీలో ఇతని పేరుతో ఉత్సవాలు రాజకీయరంగును పులుముకున్నాయని పలువురు చర్చించుకున్నారు.

ముగిసిన దేవి శరన్నవరాత్రి వేడుకలు

వర్ధన్నపేట, అక్టోబరు 13 : నవరాత్రులు ప్రజలచే నిత్యపూజలందుకున్న దుర్గామాత అమ్మవారు ఆదివారం రాజరాజేశ్వరీగా భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మండపంలో భక్తులు పూజలుచేశారు. భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలను భజన మండలి వేలం వేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు భక్తుల భజనపాటలు, కోలాటాల మధ్య శోభాయాత్ర పట్టణంలో కన్నుల పండువగా సాగింది. కోనారెడ్డి చెరువులో నిమజ్జనం చేశారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఉప్పరపెల్లి, ఇల్లందలో నవరాత్రుల పాటు పూజలందుకున్న దుర్గామాత ఉత్సవాలు ఆదివారం ముగిసాయి. దుర్గామాత శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ గ్రామ పుర వీధుల గుండా అమ్మవారిని చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

• నెక్కొండ : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆదివారం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

మైనర్లకు యథేచ్ఛగా మద్యం విక్రయాలు

వర్ధన్నపేట, అక్టోబరు 13 : మైనర్లకు మద్యం విక్రయించవద్దనే ప్రభుత్వ నిబం ధనలను తుంగలో తొక్కి లాభాపేక్షే ధ్యేయంగా వైన్‌షాపుల యజమానులు మైనర్ లకు విచ్చల విడిగా విక్రయిస్తూ అధికారుల ఆదేశాలు, నిబంధనలను తిలోదకాలి స్తున్నా పట్టించుకోని ఎక్సైజ్ అధికారుల తీరుపట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకురించుకుని వర్ధన్నపేట పట్టణంలో మద్యం ఏరులై పారింది. శనివారం పట్టణంలోని ఓ మద్యం దుకాణం వద్ద బాలుడికి మద్యం విక్రయించడం కనిపించింది. మైనర్ బాలుడికి వైన్‌షాపు యాజమాన్యం తమ వర్కర్‌తో మద్యం బయకు తీసుకువచ్చి అందించడం కెమెరాలకు చిక్కింది. బెల్టుషాపుల్లో మద్యం ఏరులై పారింది. పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి అయినా మద్యం మందుబాబులకు ఆశించిన స్థాయిలో లభిస్తుండడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు. లాభాపేక్షతో వైన్‌షాపు యజమానులు బెల్టుషాపులకు విచ్చలవిడిగా మద్యం సప్లై చేస్తున్నారు. సందెట్లో సడేమియాలాగా మార్కెట్‌లో లభించే మద్యం క్వార్టర్ బాటిల్‌పై అధికంగా రూ.50లు, హాఫ్ బాటిల్‌కు రూ.100లు వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనే ఆరోపణలు సైతం ప్రజల నుండి వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా బ్రాండిషాపులపై నిఘాపెట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు, విమర్శలు తీవ్రస్థాయిలో స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి.

టీ షాపులో చోరీ

వర్ధన్నపేట, అక్టోబరు 13 : వర్ధన్నపేట పట్టణంలో ఫిరంగిగడ్డ ప్రాంతంలోని రైస్‌మిల్లు సమీపంలోని హోటల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే పట్టణ కేంద్రానికి చెందిన గజ్జెల కొమురయ్య అనే వ్యక్తి డబ్బాలో కూల్ డ్రింక్‌లు, టీ అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం దసరా పర్వదినం కావడంతో హోటల్ తీయలేదు. దీంతో కొందరు హోటల్ తలుపులను తొలగించి రూ.10వేల విలువైన సామగ్రిని దొంగిలించినట్లు కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించడంతో విచారణ చేపట్టారు.

కారులో చెలరేగిన మంటలు

వర్ధన్నపేట, అక్టోబరు 13 : ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలో పార్క్ చేసి ఉన్న కారు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైనసంఘటన పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆస్పత్రి ఎదురుగా పార్కుచేసి ఉన్న కారులో నుంచి మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించగా హుటాహుటీన అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు పెద్దవిగా కాకుండా ఆర్పివేశారు. పండుగ రోజున పెద్ద ప్రమాదం తప్పినట్లయింది.

రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికైన నల్లబెల్లి విద్యార్థి



కర్ర గురువు రాజు

నల్లబెల్లి, అక్టోబరు 13 : మండల కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కర్ర గురువు రాజు రాష్ట్రస్థాయి క్రికెట్‌కు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు వసంత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రికెట్ అండర్ 14విభాగంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అర్హత సాధించాడన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి క్రికెట్ క్రీడకు ఎంపికై, ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గద్వాల జిల్లా కేంద్రంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ ఆడబోతున్నాడని తెలిపారు. అనంతరం విద్యార్థి కర్ర గురువురాజుకు ఉపాధ్యాయులు కోడెపాక శంకరయ్య, పద్మజ, కుమారస్వామి, అన్నాదేవి, బుచ్చన్న, శ్రీధర్‌బాబు, సంతోష్ కుమార్, శోభారాణి, కొమురయ్య, జ్యోతిలు అభినందనలు తెలియజేశారు.

ఘనంగా అంతర్జాతీయ పాస్టర్స్ డే

వర్ధన్నపేట రూరల్, అక్టోబరు 13 : మండలంలోని నల్లబెల్లిలో ఆదివారం ఘనంగా అంతర్జాతీయ పాస్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని ఎక్లెషియా పెంతకోస్తు చర్చిలో సంఘ పెద్దలు రజిత కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పాస్టర్ సుమన్ అరుణలను ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, ఏలియా, స్వరూప బాబు, కృష్ణవేణి, దయాకర్, సౌజన్య, పూలమ్మ, మానస కుమార్ తదితరులు పాల్గొన్నారు.